సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్‌లోని మధురా నగర్ రూ.1.7 కోట్లు, బృందావన్ కాలనీల్లో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజినీర్ సాయికిరణ్, బీజేపీ నేత ఎల్లాచారి, బండి పద్మ, రంగ రవి, హేమంత్, శాంతి కుమార్, గీత, స్రవంతి, జిల్లా శ్రీనివాస్, కొత్తపల్లి శ్రీనివాస్, హరిబాబు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం



ప్రత్యేక పూజల్లో ఎంపీ ఈటల

శామీర్‌పేట్: తూంకుటం మున్సిపాలిటీ దేవర యాంజాల్ పరిధిలో సేవాలాల్, దుర్గామాత ఆలయ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. దేవర యాంజాల్ మల్లన్న కాలనీ సమీపంలో గల శ్రీ సేవాలాల్ మహారాజ్, దుర్గామాత ఆలయాల 3వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆదర్శ్‌నగర్‌లో బాక్స్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి, అధికారులు

అల్వాల్: అల్వాల్ డివిజన్ ఆదర్శ్‌నగర్‌లో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పనులను శుక్రవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ ప్రశాంతి, ఏఈ వరుణ్‌దేవ్, స్థానికులు యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌కు జియో సైన్స్ అవార్డు



ఉప్పల్: నేషనల్ జియోఫిజికల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్(ఎన్‌జీఆర్‌ఐ) సంస్థ చీఫ్ సైంటిస్టు డాక్టర్ ఎం.రామ్మోహన్ ప్రతిష్టాత్మకమైన నేషనల్ జియోసైన్స్ 2024 అవార్డుకు ఎంపికైనట్లు ఆ సంస్థ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. జియో కెమిస్ట్రీలో ఆయన చేసిన కృషికిగాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపింది. గతంలో కూడా రామ్మోహన్‌కు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ ఐజీయూ క్రిష్ణన్ గోల్డ్ మెడల్స్‌తో సత్కరించిందని పేర్కొంది.

బస్టాప్‌లో ప్రైవేటు వాహనాల తిష్ట

- ప్రయాణికుల తిప్పలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల కారణంగా జిల్లా బస్సులు ఘట్‌కేసర్ బస్సులు బస్టాండ్ ప్రాంగణంలోకి రావడం లేదు. స్థానికులే కాకుండా ఈసీఐఎల్, నాగారం, రాంపల్లి, కీసర నుంచి భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, జనగాం, వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికులు బైపాస్ చౌరస్తా వరకు వచ్చి వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో బైపాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బస్టాప్‌లో ప్రైవేటు వాహనాలు తిష్ట వేస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు వాహనాలను దాటుకొని వెళ్లేలోపే బస్సులు కదులుతున్నాయి. వృద్ధులు, మహిళలు, పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. బైపాస్ చౌరస్తాలో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించక పోవడంతో రోజు రోజుకూ ఈ సమస్య తీవ్రమవుతోంది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి బస్టాప్‌లో ఆటోలు, కార్లు, ఇతర ప్రైవేటు వాహనాలు ఆపకుండా చూసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?



రహదారులపై పారుతున్న పేడ నీరు



ఓల్డ్ మల్లాపూర్‌లో రోడ్లపై, బస్తీలో పారుతున్న నీరు

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్ ఎస్సీ బస్తీ ఎగువ ప్రాంతాం నుంచి కొన్ని రోజులుగా గేదెల పేడతో కూడిన నీరు రోడ్లపై పారుతోంది. దీంతో స్థానిక బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడవలేని పరిస్థితి నెలకొంది. దుర్వాసన, దుర్గంధం భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో కుడా పేడ నీరు వస్తోందని అన్నారు. అసలే డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని తెలిపారు. గతంలో జలమండలి, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని డ్రైనేజీలో గేదెల పేడ నీరు కలిపే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇళ్లలో ఉండలేకపోతున్నాం..



బర్రెపేట నీరు డ్రైనేజీ నుంచి పొంగిపొర్లు తుండటంతో కాలనీ మొత్తం అపరిశుభ్రంగా మారుతోంది. ముక్కు పుటాలు అదిరేలా వెలువడుతున్న దుర్వాసనకు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది.

– ప్రమీల, ఓల్డ్‌మల్లాపూర్,

పట్టించుకునే వారేరి...



బస్తీలో డ్రైనేజీ లైన్‌లో గేదేలు కడిగిన నీరు, పేడను కలుపుతున్నారు. దీంతో పేడ నీరు నిత్యం బస్తీలో పారుతోంది, వరుసగా కురుస్తున్న వర్షాలకు వరదనీరుతో కలిపి రోడ్లపైకి వస్తోంది. తాగు నీటి సరఫరాలో కుడా పేడ నీరు వస్తోంది. తాగునీరు కలుషితమవుతోంది. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– రాపోలు శ్రీనివాస్, ఓల్డ్ మల్లాపూర్

యోగాతో ఆరోగ్యకర సమాజం సాధ్యం

అల్వాల్: ఆరోగ్యకర సమాజం యోగా ద్వారానే సాధ్యమని ఆయుష్ విభాగం డాక్టర్ శైలజ అన్నారు. అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యువతకు యోగా ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం 25 రోజులపాటు యోగాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వచ్చే జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, డాక్టర్ అనగ్, రేణుక, రాధిక, అనురాధ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రెండో రోజు విగ్రహాల పునఃప్రతిష్ఠాపన పూజలు



పునఃప్రతిష్ఠాపనలో భాగంగా హోమం

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలోని 400 సంవత్సరాల పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు వివిధ దేవతామంత్ర అనుష్టానం, హవనం, సాయంత్రం సంభార హోమం, పంచ గవ్యాదివాస పూర్వక జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రధాన దాత చింతల మల్లేష్, మండల రాధ, నాగరాజు, శోభన్‌బాబు, సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్, హనుమయ్య, విజయ్‌కుమార్, వీరేశం యాదవ్, ఈవో వెంకన్న పాల్గొన్నారు.

వేడుకగా ప్రజా విజయోత్సవ పుష్కర మేళా

గౌతంనగర్: ఆపరేషన్ సింధూర్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి గౌతంనగర్ డివిజన్ మల్కాజిగిరి లక్ష్మీసాయి గార్డెన్‌లో నిర్వహించిన భారతీయ ప్రజా విజయోత్సవ పుష్కర మేళా కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా శ్రీలలిత సహస్రనామ స్తోత్రం, హనుమాన్ చాలీసా, సౌందర్య లహరి పారాయణం, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీతా రామయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



భారతీయ ప్రజా విజయోత్సవ పుష్కర మేళలో కార్పొరేటర్ సునీత

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో శ్రీనివాస్‌నగర్, మైప్లవర్ గ్రాండ్, పార్క్ అపార్ట్‌మెంట్స్, జనప్రియ టౌన్‌షిప్, 11 కేవీ నరసింహనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నర్సింహనగర్, శివ హోటల్ ఏపీ కాలనీ, ఎన్టీఆర్ నగర్, ఎస్ఎస్ నగర్, మీర్‌పేట్, సాయిగార్డెన్ ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

నాచారంలో...

నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ (కాకతీయ కర్షక్) పరిధిలో 11 రామ్‌రెడ్డి నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు దుర్గానగర్, బాబానగర్, నాచారం విలేజ్, ఎర్రకుంట, అంబేద్కర్ నగర్, కమాలాబాయినగర్, హనుమాన్ నగర్, సావర్కర్ నగర్, రాంరెడ్డినగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్, కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు ఒక ప్రకటలో తెలిపారు. 11 కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కౌండిన్య నగర్, వైజయంతి థియేటర్ మెయిన్‌రోడ్, రవీంధర్‌నగర్, వీరారెడ్డి నగర్, కాలనీలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ సంతోషిమానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సంతోషిమానగర్, వినాయకనగర్, ఓల్డ్ సఫిల్‌గూడ ప్రాంతాల్లో, 11 కేవీ బాలసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో రాజీవ్‌గాంధీనగర్, విష్ణుపురి ఎక్స్‌టెన్సన్, విమలాదేవినగర్, శివపురి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

గౌతంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

11 కేవీ మీర్జాలగూడ ఫీడర్ పరిధిలో మరమ్మతుల వలన ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మీర్జాలగూడ, రాజా శ్రీనివాసనగర్, రాజానగర్, సంతోష్‌రెడ్డినగర్, లింగారెడ్డినగర్, వెంకటాద్రినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కళ్యాణ్ తెలిపారు.

ఉప్పల్: బ్యాంక్ కాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 4 గంటల వరకు బ్యాంక్ కాలనీ, ప్రశాంత్‌నగర్, బీరప్పగడ్డ, కళ్యాణపురి, రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్ నర్సింగ్ రావు తెలిపారు.

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బోడుప్పల్‌లోని పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మణికంఠనగర్, వివేకానందనగర్, శ్రీలక్ష్మినగర్, ఎస్ఐఎస్ కాలనీ, భీంరెడ్డినగర్, అశోక్ నగర్, గ్రీన్‌సిటీ కాలనీ, భవానినగర్ కాలనీ, సుభాష్‌నగర్, గెలాక్సీ హోం, రాంరెడ్డినగర్, మారుతీనగర్, టెలిఫోన్ కాలనీ, యాదాద్రి కాలనీ, పద్మావతి కాలనీ, ఆర్ఎన్ఎస్ కాలనీ, శుభోదయ కాలనీ, లెక్చరర్స్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు ద్వారకానగర్ ఫేస్ 1, 2, కేశవనగర్, ఆంజనేయ నగర్, గాయత్రీనగర్, శ్రీనివాస్‌నగర్, సాయిరాంనగర్, వీరారెడ్డినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాలికపై లైంగికదాడి

మల్కాజిగిరి: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే అశోక్(19) తన ఇంటి పక్కన ఉండే మైనర్ బాలికపై ఈ నెల 29వ తేదీన లైంగిక దాడికి పాల్పడ్డాడు. పనులకు వెళ్లి తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి బాలిక ఏడుస్తోంది. విషయం తెలుసుకొన్న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అశోక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

శివాలయ భూమి లీజుకు వేలం

రామంతాపూర్: ప్రభుత్వ దేవాదాయ శాఖ ఆధీనంలోని రామంతాపూర్ శ్రీ మల్లికార్జున స్వామి (శివా) ఆలయానికి చెందిన సర్వే నెంబర్ 91/1.91/2లో గల 27 గంటల భూమి, సర్వే నెంబర్ 216/1.216/2లో గల 800 గజాల భూమిని మూడు సంవత్సరాల కాలపరిమితికి లీజుకు ఇవ్వడానికి జూన్ 11న ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.సురేందర్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల వారు ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో గాని లేదా 98489 66212 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపునకు కృషి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానికులకూ కేటాయించే విధంగా అధికారులు కసరత్తు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నత్తి కృష్ణ అన్నారు. ప్రతాపసింగారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు తమకు మంజూరవుతాయో లేదోననే అనుమానంతో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిపై నిందలు వేస్తున్నారని చెప్పారు. ఇదే క్రమంలో ప్రతాపసింగారానికి చెందిన కొందరు మహిళలను సుధీర్‌రెడ్డి తిట్టారనే ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సుమారు వందకుపైగా ప్రతాపసింగారం ప్రజలకు లభించేలా సుధీర్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు బాలరాజ్, బద్దం కుమార్, అబేద బేగం, ప్రభాకర్‌గౌడ్, జోగు మల్లేష్, సురేష్, చంద్రమౌళి, ముత్తయ్య, పలువురు మహిళలు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

మల్లాపూర్: వ్యభిచారం నడిపిస్తున్న ఓ గృహంపై నాచారం పోలీసులు దాడి చేశారు. నాచారం ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గోకుల్‌నగర్‌లో ఓ ఇంట్లో కొంత కాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడు బొమ్మల సతీష్ (30)తోపాటు ఇద్దరు విటులు, మహిళను అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు ముందు హాజరుపరిచారు.

సౌండ్ పొల్యూషన్‌పై కఠిన చర్యలు

- రాచకొండ పరిధిలో 2,325 కేసులు నమోదు
- 1,297 సవరించిన సైలెన్సర్ల స్వాధీనం

సాక్షి సిటీబ్యూరో: వాహనాల నుంచి సౌండ్ ఇష్టానుసారంగా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అధీకృత సైలెన్సర్లపై చర్యలు తీసుకోవడాన్ని పోలీసులు ఆరంభించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ), మిషన్ లైఫ్ క్యాంపెయిన్‌తో అనుగుణంగా రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు సూచనలపై మోటార్ సైకిల్ సైలెన్సర్ల అక్రమ మార్పుపై కఠిన చర్యలు తీసుకోవడం ఆరంభించారు. ఈ మేరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 2,325 కేసులు నమోదు చేయగా 1,297 సవరించిన సైలెన్సర్లను ఉల్లంఘించిన వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ డీసీపీ ఎస్ మల్లారెడ్డి, ట్రాఫిక్-2 డీసీపీ వి శ్రీనివాసులు, డీసీపీ టి ఉషారాణి, ఏడీసీపీలు లక్ష్మీ, జి శ్రీనివాస్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు.

రోడ్డు పగులగొట్టి.. పనులు వదిలేసి..

బోడుప్పల్: 23వ డివిజన్ పరిధిలోని వాసవీనగర్ వీధి నంబరు 6లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిమిత్తం సీసీ రోడ్డును పగలగొట్టి పనులను చేపట్టారు. పనులు పూర్తి అయి మూడు నెలలు అయినా ఇప్పటివరకు రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టలేదు. దీంతో రోడ్డు అంతా ఎగుడు దిగుడుగా ఉండడమే కాకుండా రాకపోకలు ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డు పగలగొట్టినప్పుడు వచ్చిన కంకర రోడ్డుపైనే పోశారు. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. ఇదే కాలనీలో నివాసం ఉండేవారు చెత్తను తీసుకొచ్చి ఇక్కడ రోడ్డు మీదనే వేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు అంతా అపరిశుభ్రంగా మారింది. ఇదే రోడ్డు చివరన చేపట్టిన మ్యాన్‌హోల్‌పై కప్పు లేకపోవడంతో గుర్తు తెలియని ఆకతాయిలు మ్యాన్‌హోల్ లోపల రాళ్లు వేశారు. దీంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగునీరు దిగువకు సరిగ్గా పోవడం లేదు. కావున అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ పనుల కోసం పగలకొట్టిన రోడ్డుకు మరలా ప్యాచ్ వర్క్ పనులు చేపట్టి కాలనీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



డ్రైనేజీ పనుల కోసం రోడ్డు పగులగొట్టి అలాగే వదిలేసిన దృశ్యం

ఉప్పల్‌ని నంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తా



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నంబర్ వన్ స్థానంలో ఉండేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం హబ్సిగూడ డివిజన్ రామంతాపూర్ పరిధిలోని మధురానగర్‌లో రూ. ఒక కోటి 7 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు తావు లేకుండా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ చేతన మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికే ఎక్కువ శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సాయి కిరణ్‌తోపాటు టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, స్థానిక సంక్షేమ సంఘాల నేతలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ శ్రీరామా ఆర్టీసీ కాలనీలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మాజీ మేయర్ అమర్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండి సతీష్ గౌడ్‌పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటిస్తూ సకాలంలో రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి సతీష్ గౌడ్, వంగూరి పరమేష్, సబీర్ హుస్సేన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్

జనావాసాల మధ్య చెత్త రిక్షాలు వద్దు



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రవి

గౌతంనగర్: జనావాసాల మధ్య చెత్త రిక్షాలను పార్కింగ్ చేస్తూ వ్యర్థాలను వేరు చేస్తున్న కార్మికులకు ట్రాఫిక్ ఎస్ఐ రవి అవగాహన కల్పించారు. మల్లిఖార్జుననగర్‌లో కొంతకాలంగా ఇళ్ల నుంచి రిక్షా కార్మికులు చెత్తను తీసుకువచ్చి మల్లిఖార్జుననగర్ ప్రధాన రహదారి, అంతర్గత రోడ్ల పక్కన వేస్తున్నారు. చెత్తను వేరు చేస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో కాలనీ ప్రతినిధులు వెంకటయ్య, అచ్యుతరావు శనివారం ట్రాఫిక్ సీఐ నర్సింహులుకు ఫిర్యాదు చేసి వినతిపత్రం సమర్పించారు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ రవి సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇళ్ల మధ్య ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న చెత్తను డంపింగ్ చేస్తూ వ్యర్థాలను ఏరుకోవడంతోపాటు రోడ్లపై చెత్త రిక్షాలు పార్కింగ్ చేయవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటయ్య, అచ్యుతరావు, గోపాల్‌రెడ్డి, వాసంశెట్టి శ్రీనివాస్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించాలి

శామీర్‌పేట్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మూడు చింతలపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జగ్గంగూడ, కేశవరం, ఉద్దమర్రి, లక్ష్మాపూర్ గ్రామాల్లో గల దాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నాగరాజ్ చారి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి దయాకర్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు సుధాకర్ నాయక్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

ఆంజనేయస్వామి ఆలయ ట్రస్టు చైర్మన్‌గా బాలరాజ్ గౌడ్



ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బాలరాజ్ గౌడ్

పోచారం: అన్నోజిగూడలోని శ్రీ ఆంజనేయ, షిరిడి సాయిబాబా, అయ్యప్ప స్వామి దేవాలయం చారిటబుల్ ట్రస్టు చైర్మన్‌గా బాలగోని బాలరాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బాలగోని వెంకటేశ్ గౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్టు కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శి, కోశాధికారి, జాయింట్ సెక్రటరీతోపాటు మరో నలుగురు కార్యవర్గ సభ్యులుంటారని చెప్పారు. వీరు రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, విద్య, వైద్యం అందించడం, వృద్ధులను ఆదరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సామాజిక, ఆధ్యాత్మిక, పురాతన వైద్య విధానాలపై యువతకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ట్రస్టు ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధి, మరమ్మతుల కోసం వినియోగిస్తామన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు స్నాచింగ్

ఉప్పల్: మహిళ మెడలోని పుస్తెలతాడును ఇద్దరు గుర్తు తెలియని మహిళలు స్నాచింగ్ చేశారు. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయపురి కాలనీలోని సాయిబాబ దేవాలయం వద్ద బాకారం సంధ్య(40) బ్యాంగిల్ స్టోర్‌ను నడుపుతోంది. శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు గుర్తు తెలియని మహిళలు స్టోర్ వద్దకు వచ్చి బ్యాంగిల్స్ చూపించాలని కోరారు. రకరకాల గాజులు చూస్తూనే అదను చూసి వెంటనే సంధ్య మెడలో నుంచి మూడు తులాల పుస్తెల తాడును తెంపుకుని పారిపోయారు. తాను తేరుకునేలోపే వారు పారిపోయారని బాధితురాలు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.